హైదరాబాద్ వార్త



# చర్చనా..రచ్చనా..?

## నేడు జిహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్




**హైదరాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ పాలక మండలి సమావేశం నేడు మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధ్యక్షతన జరగనుంది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్,బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం కార్పొరేటర్లతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యులు సైతం హాజరై నగరంలోని సమస్యలపై చర్చించనున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ సెక్రటరీ సెక్షన్ కార్పొరేటర్ల నుంచి సుమారు 95 ప్రశ్నలను స్వీకరించినట్లు సమాచారం. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మేయర్ ప్రసంగం, ప్రశ్నోత్తరాల పర్వం వంటివి నిర్వహించనున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పరిష్కారం కానీ సమస్యలపై గళం విప్పేందుకు మజ్లీస్ పార్టీ సిద్దమవుతుండగా, అధికార పార్టీని ఇరకాటం పెట్టేందుకు కమలనాథులు వ్యూహాన్ని సిద్దం చేస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రజాసమస్యలపై నిలదీసేందుకు ఇప్పటికే ప్రశ్నలను సమర్పించినట్లు తెలిసింది. ఇప్పటికే నగరానికి సంబంధించిన కార్పొరేటర్లతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమావేశమై కౌన్సిల్‌లో వ్యవహరించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా, పరిశ్రమలకు కేటాయించిన భూములతో పాటు హైదరాబాద్‌లోని భూముల అమ్మకంపై బల్దియా సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన సూచించారు. అలాగే, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపాలని ఆదేశించారు. పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావు లేకుండా అద్భుతంగా పనిచేశారని, కోవిడ్ సంక్షోభంలోనూ విశేష సేవలు అందించారని కేటీఆర్ కార్పొరేటర్లను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని, పార్టీ అందరినీ గెలిపించుకుంటుందని భరోసా ఇచ్చారు. కాగా ఈ సమావేశంలో లఘు చర్చకు అనుమతిచి, సభ్యుల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత జనవరిలో నిర్వహించాలని భావిస్తున్న కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ కూడా వ్యూహాత్మకంగా ఆమోద ముద్ర వేయాలని పాలక మండలి భావిస్తున్నట్లు తెలిసింది. ఇక మజ్లీస్, బీజేపీ పార్టీలు మాత్రం ఎప్పటిలాగే ప్రజా సమస్యలైన శానిటేషన్, దోమలు, కుక్కల బెడద, స్ట్రీట్ లైట్ మెయింటనెన్స్, రోడ్ల నిర్వహణ, నాలాలు, వరద నీటి కాలువల నిర్వహణ వంటి అంశాలను ప్రస్తావించనున్నట్లు తెలుస్తుంది.

# రికార్డు స్థాయిలో కోకాపేట భూములు

**-నియోపోలిస్ ప్లాట్లకు భారీ డిమాండ్**
**-అన్ని రికార్డులను చెరిపేస్తూ ఎకరానికి రూ.137.25 కోట్లు**




**హైదరాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ వేడి మళ్లీ కోకాపేట వైపు మరింతగా మళ్లింది. నియోపోలిస్ లేఅవుట్ పరిసరాల్లో హెచ్ఎండిఎ నిర్వహించిన తాజా భూముల వేలంలో ధరలు అన్ని రికార్డులను చెరిపేస్తూ ఎకరానికి రూ.137.25 కోట్లు చేరాయి. ప్లాట్ నంబర్లు 17, 18లకు భారీ పోటీ నెలకొనగా, ప్లాట్ నం.17లో ఉన్న 4.59 ఎకరాలు ఎకరానికి రూ.136.50 కోట్లకు, ప్లాట్ నం.18లోని 5.31 ఎకరాలు ఎకరానికి రూ.137.25 కోట్లకు హామర్ కొట్టాయి. మొత్తం 9.90 ఎకరాలపై హెచ్ఎండికి రూ.1,355.33 కోట్ల భారీ ఆదాయం లభించింది. ఈ నేపథ్యంలో కోకాపేటలో మిగిలిన భూములను నవంబర్ 28న మరొక విడత వేలం ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాంతంపై రియల్ ఎస్టేట్ కంపెనీలు ఎందుకు ఇంత ఆసక్తి చూపుతున్నాయంటే, నియోపోలిస్ లేఅవుట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందుబాటులో ఉండటం ప్రధాన కారణాలు. ముఖ్యంగా, ఇక్కడ భవనాల ఎత్తుపై ఎలాంటి పరిమితులు లేకపోవడం వల్ల భారీ కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు నిర్మించుకునే వీలుంది. అదనంగా, కోకాపేటకు ఓఆర్ఆర్ సమీపం కావడం, రాయదుర్గం ఐటీ హబ్‌కు అత్యంత దగ్గరగా ఉండటం కూడా రియల్ ఎస్టేట్ విలువలను మరింత పెంచుతోంది. ఈ అంశాలన్నీ కలిసి కోకాపేట భూముల ధరలను ఆకాశాన్నంటేలా చేస్తున్నాయి. అంతేకాకుండా.. గతంలో కూడా నియోపోలిస్ లేఅవుట్ లో 10వ నెంబర్ ప్లాట్ అత్యధికంగా రూ.100.75 కోట్ల ధర పలికింది.

## గన్‌మిస్ ఫైర్..గాయపడిన కానిస్టేబుల్


కానిస్టేబుల్ గోవర్ధన్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త** గన్‌మిస్ ఫైర్ అయి ఓ కానిస్టేబుల్ గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధ రాత్రి అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న సీపీఎల్ చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ కథనం ప్రకారం అంబర్‌పేట సీపీఎల్ ఆయుధగారం వద్ద ఆదివారం ఏపీ క్యాడర్‌కు చెందిన గోవర్ధన్‌రెడ్డి (39) విధులు నిర్వహిస్తున్నాడు. సుమారు రాత్రి 12.30 గంటల ప్రాంతంలో గోవర్ధన్‌రెడ్డి తన వద్ద ఎస్ఎల్ఆర్ గన్ను శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా మిస్ఫైర్ అయింది. దీంతో అతని చాతీలో నుంచి బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో అతను అక్కడిక్కడే కుప్పకూలిపోవడంతో గమనించిన సిబ్బంది చికిత్స నిమిత్తం వెంటనే అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదృష్టవశాత్తు బుల్లెట్ గండెకు కొద్దిగా పైగం నుంచి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పిం దని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న ఆర్ఐ ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## దంపతులను ఢీకొట్టిన డిసిఎం వ్యాన్

**-అక్కడికక్కడే భర్త మృతి, చావు బతుకుల మధ్య భార్య**


ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు, పోలీసులు

**కుత్బుల్లాపూర్, నవంబరు 24 ప్రభాతవార్త** కన్నకూతురును చూసి తిరిగి వెళుతున్న తల్లిదండ్రులను యమపాశంలా వచ్చిన డిసిఎం వ్యాను ఢీకొట్టిన సఘటనలో తండ్రి అక్కడికి అక్కడే మృతిచెందగా ఆసుపత్రిలో బార్యచావు బతుకుల మధ్య పోరాడుతున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా బుజునూరుకు చెందిన కటంగూలి వెంకటరామిరెడ్డి(62) ఆయన బార్య కటంగూలి లత(58)లు చింతల్‌లోని శ్రీసాయి కాలనీలో నివాసముండే తన కూతరు కటంగూలి దీపికను చూసి వెళ్లదామని పదిరోజులక్రితం వచ్చారు. పదిరోజులు కూతురువద్ద వుండి తిరుగు ప్రయాణంలో భాగంగా సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో చింతల్‌లోని పెడస్ట్రిల్ సిగ్నల్ వద్ద శ్రీసాయి కాలనీనుండి గణేష్‌నగర్‌కు రోడ్డుదాటుతున్నారు. ఇదేసమయంలో బాలానగర్ నుండి జీడిమెట్ల వైపు వెళుతున్న డిసిఎం టాటాఎసి వాహానం అతివేగంగా వీరిద్దరినీ బలంగా ఢీకొట్టింది. దీనితో వెంకటరామిరెడ్డి టాటాఎసి ఢీకొట్టిన వేగానికి సుమారు 10 అడుగుల దూరంలో పడి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికి అక్కడే మృతిచెందగా ఆయన బార్య కటంగూలి లత తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్సనిమిత్తం స్థానికగా గల ప్రాణధార ఆసుపత్రికి తరలించారు. చావు బతుకుల మధ్య లత కొట్టుమిట్టాడుతుంది. తన తండ్రి మృతికి, తల్లి చికిత్సకు కారణమైన టాటాఎసి డిసిఎం డ్రైవర్‌పై తక్షణ చర్యలు చేపట్టాలని వారి కూతురు కట్టంగూలి దీపిక పోలీసులకు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు ఎమ్మెల్యేగా నవీన్‌యాదవ్ ప్రమాణ స్వీకారం

**జూబ్లీహిల్స్, నవంబరు 24, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గెలిచిన వల్లాల నవీన్‌యాదవ్ ఎమ్మెల్యేగా ఈ నెల 26న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు స్పికర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఛాంబర్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇదిలా ఉండగా సోమవారం నవీన్‌యాదవ్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. నవీన్‌యాదవ్‌తోపాటు బీజీజేఏసీ ఛైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, రమేష్‌యాదవ్, దీపక్, చక్రి తదితరులు పాల్గొన్నారు. అంతకముందు ఉప ఎన్నికల్లో మద్దతునిచ్చిన తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదరండరాంను ఆయన కలిసి పుష్పగుచ్చాలను అందించారు. తనను మెజార్టీతో గెలిపించినందుకు నవీన్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న నవీన్‌యాదవ్

## డిమాండ్లు సాధన కోసం కమిషనర్ కార్యాలయం ముట్టడి

**-అమలు చేయకపోతే నివరధిక సమ్మె చేస్తాం**


కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన వంట కార్మికులు. చిత్రంలో ఎం.నర్సి ంహ్మా, పి.ప్రేమ్‌పావని, జంపాల రవీందర్ తదితరులు

**సైఫాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** మధ్యాహ్నా భోజన పథకంలో సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని, లేకపోతే ప్రతి విద్యార్థికి మెనూ చార్జీలు 25 రూపాయల చోప్పున చెల్లించాలని, ఎన్నికల హామీ ప్రకారం వంట కార్మికులకు 10 వేల రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది కార్మికులు సోమవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ మధ్యాహ్నా భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వందలాది మంది కార్మికులు వివిధ జిల్లాల నుంచి వచ్చి ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రా ష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.పేమ్‌పావని, జ ంపాల రవీందర్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని, లేని పక్షంలో డిసెంబరు చివరి వారం నుంచి నిరవధికంగా సమ్మెలో పాల్గొంటారని హెచ్చరించారు. 24 సంవత్సరాలుగా మధ్యాహ్నా భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులు తమ సొంత డబ్బులు వెచ్చించి పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని చెప్పారు. పెట్టిన పెట్టుబడి డబ్బులు 9, 10 నెలలుగా పెండింగ్‌లో ఉంటే పిల్లలకు ఎలా తిండి పెడతారని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలకు మార్కెట్‌లో లభిస్తున్న ధరలకు చాలా వ్యత్యాసం ఉందని, కార్మికులు ఆనేక ఇబ్బందులకు గురివుతున్నారని, అలాగే వంట కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నెలకు 10 వేల రూపాయలు వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొరివి సుగుణ, చక్రపాణి,రాములు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు నేర ప్రవృత్తి విడనాడాలి : సిపి సజ్జనార్

**-అర్ధరాత్రి పెట్రోలింగ్ వాహనంలో రౌడీ షీటర్ల ఇళ్లకు సిపి సజ్జనార్**
**-నేర చరిత్ర, జీవన విధానంపై ఆరా.. నేర ప్రవృత్తి వీడాలంటూ హితవు**
**-లంగర్ హౌస్, టోలిచౌకిల్లో అర్ధరాత్రి సిపి ఆకస్మిక పర్యటన**


రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న సిపి సజ్జనార్

**మెహిదీపట్నం, నవంబర్ 24, ప్రభాతవార్త :** రౌడీ షీటర్లు నేర ప్రవృత్తి విడనాడి సన్మార్గంలో నడవాలని నగర సీపీ వీసీ సజ్జనర్ హితవు పలికారు. మళ్లీ నేరాల వైపు అడుగు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం అర్ధరాత్రి సౌత్ వెస్ట్ జోన్ లంగర్ హౌస్, టోలిచౌకి పోలీస్ స్టేషన్ ల పరిధిలో ని రహదారులు, కీలక ప్రాంతాలతో పాటు సున్నితమైన పాయింట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. పెట్రోలింగ్ వాహనంలో స్వయంగా గస్తీ నిర్వహించి, సైరన్ లేకుండా వాహనంలో ఎం.డీ లైన్స్, ఆశాం నగర్, డిఫెన్స్ కాలనీల్లోని రౌడీ షీటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లారు. ఇంట్లోనే ఉన్న రౌడీ షీటర్లను నిద్రలేపి వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఆరా తీశారు. టోలిచౌకి పరిధిలో రాత్రిపూట తెరిచి ఉన్న హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల్లోకి వెళ్లి, నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో షాపులు తెరిచి ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. పెట్రోలింగ్ సిబ్బంది ఎంత మేర అప్రమత్తంగా ఉన్నారు, రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు అనే అంశాలపై క్షేత్రస్థాయిలో నేరుగా ఆరా తీశారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు, అధికారులను స్వయంగా కలుసుకుని, గస్తీ పాయింట్లు, స్పందన వేగం, సమస్యల పరిష్కారంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి.. స్టేషన్ జనరల్ డైరీ, రాత్రి చేసిన ఎంట్రీలు, డ్యూటీలో ఉన్న సిబ్బంది హాజరు వివరాలు, వారికి అప్పగించిన బాధ్యతలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ..రాత్రి వేళల్లో పోలిసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎలా స్పందిస్తున్నారన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆకస్మిక పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు. పీపుల్ వెల్ఫేర్ పోలిసింగ్‌లో భాగంగా చేపడుతున్న ఈ పర్యటనలు సిబ్బంది బాధ్యతా భావాన్ని పెంపొందించడమే కాకుండా, సేవల నాణ్యతను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. నగరంలో నేరాలపై కఠినమైన పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి సమస్యకు వెంటనే స్పందించే విధంగా బృందాలు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు.

# విద్యార్థుల వివరాలను వారంలోపు సమర్పించాలి

**-అధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరించన దాసరి, డిఆర్‌వో వెంకటాచారి, ఆశన్న తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల వివరాలను వారంలోపు సమర్పించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్స్ పై ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఆర్‌వో ఈ వెంకటాచారి తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు వారంలోపు అందజేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అలాగే డిసెంబర్ 15 నాటికి చివరి తేదీ కావడంతో విద్యార్థులకు సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయటంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల వివరాలను వేగవంతంగా సేకరించి తాసిల్దార్లకు నివేదిక అందించాలని ఆమె సూచించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల బాలురుకు ఐదు నుండి ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ. 1000 రూపాయలు చొప్పున అలాగే బాలికలకు సంవత్సరానికి రూ. 1500చొప్పున చెల్లించడం జరుగుతుందని తెలిపారు. అలాగే రాజీవ్ విద్యా దీవెన పథకం కింద 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ. 3500 చొప్పున అందించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా 9, 10 వ తరగతి చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు రూ. 4000 చొప్పున సంవత్సరానికి స్కాలర్షిప్ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు కుల, ఆదాయ దృవీకరణ, విద్యార్థిపాస్ ఫోటో, బ్యాంక్ పాస్ పుస్తకం మొదటి పేజీ అలాగే ఆధార్ కార్డు జిరాక్స్ గల ధ్రువపత్రాలతో మీసేవ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని, కుటుంబ వార్షిక ఆదాయం 2 లక్షల కంటే తక్కువ ఉండాలని తెలిపారు. ఈపాస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కానీ పాఠశాలలు సత్వరమే రిజిస్ట్రేషన్ అవ్వాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, సంక్షేమ అధికారులు ప్రవీణ్ కుమార్, జి ఆశన్న, కోటాజి, డిప్యూటీ డిఈఓ లు, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# 42 కిలోల గంజాయి, ఎండిఎంఏ, అల్ప్రాజోలం డ్రగ్స్ స్వాధీనం


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి రితురాజ్, ఎస్ఓటీ డిసిపి శోభన్‌కుమార్


స్వాధీనం చేసుకున్న గంజాయితో కొల్లూరు పోలీసులు

**గచ్చిబౌలి, నవంబరు 24 ప్రభాతవార్త** సైబరాబాద్ కమీషనరేట్ మాదాపూర్ జోన్ పరిధిలోని రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో మదక ద్రవ్యాలను రవాణా చేస్తూ పలువురు పోలీసుల చేతికి చిక్కారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో వలస కూలీలకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్న 42 కిలోల గంజాయిని ఎస్ఓటీ, కొల్లూరు పోలీసులు కలిసి స్వాదీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి 15.2 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో న్యూ ఇయర్ సందర్భంగా ఏర్పాటు చేసే పార్టీ కోసం విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లు కాంపౌండ్‌లలో కల్లులో కలిపేందుకు మెదక్ నుంచి నగరానికి తీసుకువచ్చి ఇంట్లో పెట్టుకున్న 1170 గ్రాముల ఆల్ప్రాజోలం డ్రగ్‌ను సైతం చందానగర్, ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను సోమవారం గచ్చిబౌలిలోని డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాదాపూర్ డిసిపి రితురాజ్ వెల్లడించారు...

**కొల్లూరులో గంజాయి..**

బీహార్ రాష్ట్రం రూమాబరాన్‌కు చెందిన మిథున్ బర్మాన్(36) నగరానికి వచ్చి ఇస్నాపూర్‌లో ఉంటూ లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనితో పాటు పశ్చిమ బెంగాళ్ రాష్ట్రం దూదూండా గ్రామానికి చెందిన సుదేన్ రాయ్(25) కోకాపేట లేబర్ క్యాంపులో ఉంటూ కూలీగా, పశ్చిమ బెంగాళ్‌లోని బినోద్ నగర్ గ్రామానికి చెందిన రీజౌల్ షేక్(30) లింగంపల్లిలోని లేబర్ క్యాంపులో ఉంటూ కూలీలుగా పని చేస్తున్నారు. వీరు సుల భంగా డబ్బు సంపాదించడం కోసం సమీప లేబర్ క్యాంపుల్లో ఉండే కూలీలకు గంజాయి విక్రయించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పశ్చిమ బెంగాళ్ నుంచి వచ్చి తెల్లాపూర్‌లో ఉంటున్న తపన్ బిస్వాస్‌ను సంప్రదించారు. అతను పశ్చిమ బెంగాళ్‌లో వీరికి గంజాయి ఇప్పించాడు. ముగ్గురు నిందితులు సదరు గంజాయిని రైలులో నగరా నికి తీసుకువచ్చి, సికింద్రాబాద్ నుంచి ఆటోలో కొల్లూరుకు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న కొల్లూరు, ఎస్ఓటీ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 21లక్షల రూపాయల విలువైన 42 గ్రాముల గంజాయిని, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**ఎండిఎంఏ డ్రగ్స్..**

శేరిలింగంపల్లి పరిధిలోని బాపూనగర్‌కు చెందిన దేవ్రా హరీష్(28) కూలీగా పనిచేస్తుండగా, కుంచాల సాయిక్రిష్ణ(28) హౌజ్‌కీపింగ్ పనిచేస్తున్నాడు. తెల్లాపూర్‌లో ఉంటున్న గుంజి సాయిమణి కంట(24) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వీరు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారు. హరీష్ తరచూ తన సోదరుడు అరుణ్‌ను కలిసేందుకు బెంగళూరు వెళ్లి అక్కడ డ్రగ్స్ సేవిస్తుండగా, బెంగళూరు నుంచి నగరానికి డ్రగ్స్ తెచ్చి విక్రయించాలని పథకం వేశాడు. ఇదే విషయాన్ని తన స్నేహితులు సాయిక్రిష్ణ, సాయిమణికంఠకు చెప్పగా వారు అంగీకరించారు. దీంతో ముగ్గురు కలిసి బెంగళూరు వెళ్లి అరుణ్‌ను కలిశారు. అతను వీరికి 15 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ విక్రయించగా, దాన్ని నగరానికి తీసుకువచ్చి గ్రాము 10వేల చొప్పున విక్రయించాలని పథకం వేశారు. ఈనెల 23వ తేదీన డోయన్స్ కాలనీ సమీపంలోని బావార్చి హోటల్ వద్ద ముగ్గురు కలుసుకొని డ్రగ్స్‌ను విక్రయించేందుకు ప్రయత్నించగా, ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 15 గ్రాముల ఎండిఎంఏ, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు అరుణ్ పరారీలో ఉన్నాడు.

**ఆల్ప్రాజోలం డ్రగ్స్...**

చందానగర్ పరిధిలోని వేమనరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న గుండ్ల బాలమురళీ క్రిష్ణ(38) మెదక్ జిల్లా దౌల్తాబాద్‌లో సాయి సుధాకర్ అనే వ్యక్తితో కలిసి కల్లు కాంపౌండ్ నిర్వహిస్తున్నాడు. కాగా కల్తీ కల్లును తయారు చేసేందుకు ఉపయోగించే నిషేదిత అల్ప్రాజోలం డ్రగ్స్‌ను సేకరించాడు. ఒక్క గ్రాము ఆల్ప్రాజోలం డ్రగ్స్‌తో 600 సీసాల కల్లు తయారు చేయవచ్చని తెలుసుకొని, తన కల్లు కాంపౌండ్‌తో పాటు మరో రెండు కల్లు కాంపౌండ్‌లలో అల్ప్రాజోలంతో కల్తీ కల్లు తయారు చేసేందుకు మెదక్ జిల్లా పొడిచాన్‌పల్లి గ్రామానికి చెందిన రవితేజ వద్ద నుంచి 1170 గ్రాముల ఆల్ప్రాజోలం డ్రగ్స్‌ను కొనుగోలు చేశాడు. సదరు డ్రగ్‌ను చందానగర్‌లోని తన నివాసంలో ఉంచాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న చందానగర్, ఎస్ఓటీ పోలీసులు బాలమురళీ క్రిష్ణ ఇంటి మీద దాడి చేసి 12 లక్షల రూపాయల విలువైన 1170 గ్రాముల ఆల్ప్రాజోలం డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడు క్రిష్ణను అరెస్టు చేయగా, రవితేజ, సాయిసుధాకర్‌లు పరారీలో ఉన్నారు.

## గాంధీ వైద్యులు, సిబ్బంది పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి



గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ వాణికి జ్ఞాపికను అందిస్తున్న ఐపీఓఎస్ అధికారిణి అనన్యప్రియ

**సికింద్రాబాద్, నవంబర్ 24 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పోస్టల్ సేవలను వినియోగించు కోవాలని సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరిం టెండెంట్, ఐపీఓఎస్ అధికారిణి అనన్యప్రియ కోరారు. ఈమేరకు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణిని సోమవారం కలిసి పోస్టల్‌శాఖ అందిస్తున్న పోస్టల్ ఖాతాలు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన తదితర సేవలను వివరించారు. ఎక్కువ వడ్డీ ఇచ్చే ఏకైక ప్రభుత్వ రంగ సంస్థగా పోస్టల్‌శాఖను అభివర్ణిం చారు. సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించేం దుకు గాంధీ ఆస్పత్రి ప్రసూతి విభాగం వద్ద ప్రత్యేక ప్రతినిధులను నియమించనున్నట్లు తెలిపారు. పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలపై గాంధీ వైద్యులు, సిబ్బందికి చైతన్యం కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి కోరగా అంగీకరించారు. అనంతరం సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణికి ఐపీఓఎస్ అధికారి ణి అనన్యప్రియ జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో గాంధీ ఆర్ఎంఒ-1 శేషాద్రి, పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పోస్టల్‌శాఖ ప్రతినిధి పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

### అద్భుతంగా సాగిన మధుర గీతాలు" సంగీత మహోత్సవం



అతిధులకు సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 24(ప్రభాతవార్త ) :** శ్రీ ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ విజయ్ క్రియేషన్ సంయుక్త ఆధ్వ ర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభ మెయిన్ హాల్లో జరిగిన మధుర గీతాలు" సంగీత విందు ఒక అద్భుతమైన సంగీత మహోత్సవంగా సాగింది. ప్రముఖ గాయకుడు, నిర్వాహక సంస్థ అధినేత పేరి నాగేశ్వరరావు జన్మదినోత్సవాన్ని ఈ కార్యక్ర మం జరిగింది. ముఖ్య అతిథిగా గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి, సిండికేట్ బ్యాంక్ పూర్వ అసిస్టెంట్ ఇండస్ట్రియల్ మేనేజర్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, ఆంధ్ర బ్యాంకు పూర్వపు అసిస్టెంట్ మేనేజర్ కర్ర శ్రీరామమూర్తి, , ఇతర సాంస్క ృతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆల్ ఇండియా క్యాటరర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, లైన్స్ క్లబ్ కందాల శ్రీనివాస్ ను సత్కరించారు. కువైట్ దేశం నుంచి గాయ కుడు పి.చంద్రశేఖర శాస్త్రి పాల్గొన్నారు. పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయ లక్ష్మి మ్ర మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో కూడా ద్యు తి మ్యూజికల్ అకాడమీ , ఇషాన్ ఫౌండేషన్ ముందంజలో ఉంటూ, అనేక పాఠశాలలకు విద్యా సహాయం, అవసరమైన చోట ఆర్థిక చేయూత అందిస్తూ వస్తున్నాయి. ఉప్పల్‌లోని అభయ ఫౌండేషన్ వారికి నిత్యాన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమాజ సేవలో విశేషంగా పాల్గొంటూ సేవామూర్తులుగా నిలుస్తున్నారన్నారు.

## ఓటు చోరీని అడ్డుకొని తీరుతాం : బండి రమేష్



సమావేశంలో పాల్గొన్న బండి రమేష్

**కూకట్‌పల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ అయిన ఓట్ చోరీని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకొని తీరుతామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఓటు చోరీ అయ్యే విధానాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిపిసిసి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్‌లో ఇన్చార్జి రమేష్ అధ్యక్షత న బ్లాక్, డివిజన్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మా ట్లాడుతూ ఓట్ చోరిని అడ్డుకునేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు గట్టిగా పోరాడాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని రేపటి నుండే మొదలుపెట్టనున్నట్టు రమేష్ తెలిపారు.

### ఖైరతాబాద్ డిసిసి ప్రెసిడెంట్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్, నవంబరు 24 ప్రభాతవార్త :** ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా నియమితులైన మోత రోహిత్‌ను సోమవారం బహదూర్‌పుర, చార్మినార్ ,యాకుత్ పుర అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇంఛార్జిలు పులిపాటి రాజే ష్ కుమార్, ముజీబుల్లా షరీఫ్, కె.రవిరాజ్‌లు కలిసి అభినందనలు తెలిపారు. మోత రోహిత్‌ను వారు శాలువతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

### ఫలక్‌నుమా ధోబీ ఘాట్‌లో రూ.11 లక్షలతో అభివృద్ధి పనులు



ఫలక్‌నుమా ధోబీ ఘాట్‌లోని రజక శ్మశాన వాటికలో నిర్మించిన సిట్టింగ్ గ్యాలరీ, వాష్ రూమ్‌లను బిజెపి నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి ప్రారంభిస్తున్న దృశ్యం

**చార్మినార్, నవంబరు 24 ప్రభాతవార్త :** పాతబస్తీ ఫలక్‌నుమా ధోబీఘాట్‌లో దాదాపు 11 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించి న సిట్టింగ్ గ్యాలరీ, వాష్ రూమ్‌లను బిజెపి నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి ప్రారంభించారు. ధోబీఘాట్‌లోని రజక శ్మశాన వాటికలో అవసరమైన వసతులు కల్పించినందుకు రజక సంఘం ప్రతినిధు లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అల్లంపల్లి నిరంజన్ దాస్, అల్లంపల్లి యాదయ్య, అల్లంపల్లి నర్సింహ, బండారి కృష్ణ, అల్లంపల్లి దశరథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# యాంటీ కరప్షన్ బ్యూరో పేరిట నకిలీ ముఠా

### పోలీసులు నుంచి తృటిలో తప్పించుకున్న నలుగురు వ్యక్తులు

**అల్వాల్, నవంబరు 24 ప్రభాతవార్త:** యాంటీ కరప్షన్ బ్యూరో పేటిట నకిలీ గుర్తింపు కార్డులతో చలామణి అవుతున్న ముఠా సభ్యులు తృటిలో పోలీసులు నుంచి తప్పించుకుని పారి పోయారు. ముఠా సభ్యులు వాడిన కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపి న వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 21వ తేదీన అల్వాల్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ తరుణ్ కుమార్ రెడ్డి విజిబుల్ పోలీసింగ్‌లో బాగంగా బొల్లారం బర్టన్‌గూడా ప్రాంతంలో మరో కానిస్టేబుల్‌తో పాటు ఉన్నారు. రాత్రి 9 గంటలు సమయంలో బొల్లా రం నుంచి కొంపల్లి వెళ్ళే మార్గంలో ఇన్నోవా (ఎపి 09 బిఎల్ 0033) కారు కనిపించడం దాని నెంబరు ప్లేట్‌పై యాంటీ కరప్షన్ కమిటీ అని రాసి ఉంది. వాహ నంపై అనుమానం రావడంతో దగ్గరికి వెళ్ళి డ్రైవర్‌ను ఎస్ఐ వివరాలు అడిగారు. వాహనంలో యాంటీ కరప్ష న్ కమిటీకి చెందిన అధికారి ఉన్నారని సమాధానం ఇచ్చాడు. కారులో ఇంకా ఎవరు ఉన్నారని ప్రశ్నించగా తిరుమలరావు, సందీప్, సందీప్ కుమార్, రామమూర్తి శ్రీకాంత్ అనే వ్యక్తులు ఉన్నట్లు డ్రైవర్ చెప్పాడు. డ్రైవర్ లో భయం కనిపించడంతో ఐడి కార్డు చూపించమని ఎస్ఐ కోరాడు. ఐడి కార్డులు డ్రైవర్ చూపించాడు. డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించమని ట్రాఫిక్ సిబ్బందిని ఎస్ఐ తరుణ్ రెడ్డి ఆదేశించారు. పరీక్షల్లో డ్రైవర్ మద్యం సేవించినట్లు ధృవీకరణ అ య్యింది. విషయాన్ని ఎస్ఐ ఉన్నతాధికారికి ఫోన్‌లో తెలుపుతున్న సమయంలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు అక్కడి నుంచి పారి పోయారు. ఇన్నోవా వాహనంతో పాటుగా ఐడి కార్డులపై విచారణ జరపగా యాంటీ కరప్షన్ కమిటీ అనే విభాగం లేదని తేలింది. నకిలీ ఐడి కార్డులతో ముఠా మోసాలకు పాల్పడుతున్న విషయాన్ని పోలీసులు నిర్ధారించుకున్నారు. ఎస్ఐ తరుణ్ కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఎక్సైజ్ పోలీసులతో డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతాం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



గండిపేట ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, నవంబర్ 24 ప్రభాతవార్త :** రాష్ట్రంలో రోజు రోజుకు విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కు పాదం మోపేందుకే ఎక్సైజ్ శాఖను బలోపేతం చేయ డం జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో నూతన గండిపేట ఎక్సైజ్ పోలీ సు స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇటీవల రాజధాని హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలలో సైతం డ్రగ్స్ దందా పెరిగిపోయిందని, ఫలితంగా యు వత డ్రగ్స్‌కు అలవాటు పడి ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువతను కాపాడేందుకు, డ్రగ్స్ దందాపై సీఎం రేవంత్‌రెడ్డి ఉక్కు పాదం మోపుతున్నారని వివరించారు. ఇందులో భాగం గానే రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్‌లో ఉన్న ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల నిర్మాణంకు కావాల్సిన నిధులన్నింటిని మంజూరు చేస్తామన్నారు. అవసరమైన కొత్త ఎక్సైజ్ పోలీసులను కొత్తగా నియమించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ దేవేందర్‌రావ్, సహకార సంఘం చైర్మన్ రాందాసు ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శాస్త్రం లోవిశిష్ట పరిశోధనలు చేసిన ఎల్లాప్రగడ సుబ్బారావు

### -ఆచార్య కొలకలూరి ఇనాక్



ప్రసంగిస్తున్న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యాక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్

**చిక్కడపల్లి నవంబర్ 24 ప్రభాతవార్త :** ఎల్లాప్రగడ సుబ్బా రావు వైద్య శాస్త్రం పలు రుగ్మతలకు పరిశోధనలు చేసినా ఆయనకు రావలసినంత గుర్తింపు రాలేదని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపా ధ్యాక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అవేదన వ్యక్తం చేశారు. త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన ఎందరో మహా నుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా వైద్య శాస్త్రంలో ప్రముఖుడు, ఫోలిక్ ఆమ్లం నిజస్వరూపాన్ని కనుగొన్న ప్రముఖుడు డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు యాది లో సంస్మరణ సమావేశం తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగింది. ముఖ్య అతి థిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ఎల్లాప్రగడ సుబ్బారావు వివిధ రసాయనాలు సమ్మేళ నాలు తో ప్రయోగాలు చేసి ఫోలిక్ ఆమ్లం కని పెట్టారు అనీ ఇది రక్తం లోని హిమోగ్లోబిన్ క్షీణత ను అరికట్ట టం దోహదపడుతుందన్నారు. ఎల్లాప్రగడ సుబ్బా రావు తెలుగు వారు కావటం మనకు గర్వకారణం అని కానీ తెలుగు వారైనందున తగిన గుర్తింపు కు అయన నోచుకోలేదని అన్నారు. ప్రముఖ పాత్రికేయులు జయసూర్య, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్ బి.రామ్, ప్రముఖ గాయకుడూ శ్రీధరం రామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### రూ:26 లక్షల జిహెచ్‌ఎంసి నిధులతో జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి



జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి నవంబర్ 24 ప్రభాతవార్త :** రూ:26 లక్షల జిహెచ్ఎంసి నిధులుతో చేపడుతున్న జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులను గాంధీ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్ కుమార్ జిహెచ్ఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గీత, అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్, కాంట్రాక్టర్ బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.విన య్ కుమార్ , బిజెపి నేతలు, జవహర్ నగర్ వ్యాయా మశాల ఆటస్థలం మరియు కళ్యాణ మండపం పరిరక్షణ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ లోని లోపాలను సవరించి, లైట్లు, ఫ్యాన్లు, మరుగు దొడ్ల రిపేర్లు చేయించి, రంగులు వేయించి త్వరలో డివి జన్ ప్రజల అందుబాటులోకి తీసుకువస్తామని అన్నా రు. పనులను పర్యవేక్షించారు. అభివృద్ధి పనులకు కలిగిన ఆలస్యం పై అరా తీశారు. పనుల్లో ఏటువంటి ఆలస్యం కలగడానికి వీల్లేదని, పనులను నత్తనడకన జరపడం సబబు కాదని కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 15 రోజుల్లో మరమత్తులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, దామోదర్, శ్రీకాంత్, పి.నర్సింగ్ రావు, ఎం. ఉమేష్, శివకుమార్, సురేష్ రాజు, ఆనంద్ రావు, శ్రీనివాస్ యాదవ్, నీరజ్, జ్ఞానేశ్వర్ మరియు జవహర్ నగర్ వ్యాయామశాల ఆటస్థలం మరియు కళ్యాణ మండపం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్, గుండు జగదీష్, జి.మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం ఆలస్యం

### -ఆస్తి పన్ను వసూళ్లలో అక్రమాలు
### -మంత్రికి ఎమ్మెల్యే ఫిర్యాదు



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 25 ప్రభాతవార్త:** కొత్తపేట సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం సజావుగా సాగ డం లేదని అదేవిధంగా నియోజకవర్గంలోని ఆస్తిపన్ను వసూళ్ల విషయంలో అనేక అక్రమాలు చోటు చేసుకుం టున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొ న్నారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్లతో కలిసి ఎమ్మె ల్యే ఆధ్వర్యంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆసుపత్రి నిర్మాణంతో పాటు పోలీస్‌స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్, పార్కు తదితర సౌకర్యాలు ఉం డాలని గతంలో నిర్ణయించడం జరిగిందని నేడు వాటిని పక్కకు ఎందుకు పెట్టారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆసుపత్రి నిర్మాణం కేవలం 14 అంతస్తులకు మాత్రమే పరిమితం చేశారన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్ పరిధి లో ఆస్తి పన్నుకుసంబంధించి అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నయని మంత్రి దృష్టికి తీసుకువె ళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిన్నారం విట్టల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, సామ తిరుమలరెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాగలక్ష్మి, యాదగిరిముదిరాజ్, జయశ్రీ, గట్టు శ్రీను, రమణారెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్ చారి పాల్గొన్నారు.

### వ్యవసాయ విశ్వవిద్యాలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్



**అత్తాపూర్ నవంబర్ 24, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ లో ని వ్యవసాయ వి శ్వవిద్యాలయం ఆ రోగ్య కేంద్రంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ కృషి అధ్యక్షుడు ఆర్. జగదీశ్వర్ , ఎంజేఎన్‌జె హాస్పిటల్ వైద్య బృందం, ఆరోగ్య కేంద్ర ఇన్‌చార్జ్ డాక్టర్ వి. హేమలత, విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ బి. చందనా మరియు డాక్టర్ ఇంద్రసేన్ రెడ్డి సమక్షంలో వ్యవసాయ కళాశాల, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యుల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం ,ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్స హించడం లక్ష్యమన్నారు. ఈ శిబిరంలో సిబ్బంది, అధ్యాపకు లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పరీక్షలు చేయించు న్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె. శ్రీనివాస బాబు ,తదితరులు పాల్గొన్నారు.

### పేదల ఆకలి తీర్చేందుకు మరిన్ని భోజన కేంద్రాలు



ఐదు రూపాయల భోజన కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి

**ముషీరాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త:** పేదల ఆకలి తీర్చేందుకు నగరంలో మరిన్ని ఐదు రూపా యల భోజన కేంద్రాలు నిర్వహించేందుకు ప్రభు త్వం యోచిస్తోందని డిప్యూటి మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఇందిరాపార్కు వద్ద నున్న ఐదు రూపాయల భోజన కేంద్రాన్ని శ్రీలతా శోభన్‌రెడ్డి సందర్శించి, భోజనం వడ్డించి, సామాన్య ప్రజలతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి మేయర్ మాట్లాడుతూ భోజన కేంద్రాలను నిరుపేద ప్రజలందరూ సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, నిరుపేదలు ఆకలి తీర్చుకోవటం ఎంతో ఆనందం గా ఉందన్నారు.

## నాలుగు కార్మిక కోడ్‌ల అమలు శ్రామిక ప్రజలపై దాడి చేయడమే

### :ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి



ఐఎన్‌టియూసి సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ జి.సంజీవరెడ్డి.

**హైదరాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త** నిరంకుశ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక యజమాని అనుకూల నాలుగు కార్మిక కోడ్‌ల అమలు శ్రామిక ప్రజలపై దాడి చేయడమేనని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షు లు, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ జి. సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. బాగ్‌లింగంపల్లి, వివిస్టి ఫంక్షన్ హాల్, ఐఎన్‌టియుసి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఐఎన్‌టియుసి ముఖ్య ఉపాధ్యక్షులు, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి అధ్యక్షులు బి. జనక్ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖ ర్, ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, త్యాగరాజన్, కార్యదర్శి ఎల్డి. పాల్ లతోకలసి జి. సంజీవ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ శ్రామిక శక్తికి గౌరవప్ర దమైన వేతనాలు, రక్షణ మరియు ప్రగతిశీల సంక్షేమాన్ని నిర్ధారించడం కోసం గత కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసి కేవలం కార్పొరే ట్ కంపెనీల లబ్ధి కోసం నాలుగు కార్మిక కోడ్‌ల అమలు చేయ డం శ్రామిక ప్రజలపై యుద్ధం ప్రకటించడమే అని మండిపడ్డా రు. దుర్మార్గమైన నాలుగు కార్మిక కోడ్‌లతో దేశాన్ని తిరిగి దోపిడీ యుగంలోకి తీసుకెళ్లడానికి ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నాలుగు కార్మిక కోడ్‌ల అమలు ను చేబడితే, ప్రజల ఆశలు, విశ్వాసం మరియు ఆకాంక్షలను తుడిచిపెడతాయని, వాటి అమలును తక్షణమే ఆపి, రద్దు చేయాలనీ అయన డిమాండ్ చేసారు. లేని పక్షంలో ఐఎన్‌టి యుసి దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తుందని కేంద్ర ప్రభు త్వాన్ని హెచ్చరించారు. ఇందు కోసం ఐఎన్‌టియుసి రాష్ట్రాల వారీగా, ప్రాంతాలవారీగా పోరాటాలు వెంటనే ప్రారంభించాలని జి.సంజీవ రెడ్డి పిలుపునిచ్చారు. బి. జనక్ ప్రసాద్ మాట్లాడు తూ కార్మికులకు వాస్తవిక బానిసత్వాన్ని విధించడానికి నాలుగు కార్మిక కోడ్‌ల అమలుకు కేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిం చడం దుర్మార్గమని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నాలుగు కార్మిక నియమావళిల అమలును అయన తీవ్రంగా వ్యతరేకిస్తు, జి.సంజీవ రెడ్డి పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఆందోళనలను చేపడుతామని తెలిపారు.

# ముగిసిన రచయిత్రి సుధా రామరాజు అంత్యక్రియలు

### హాజరైన పలువురు ప్రముఖులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, రాజకీయవేత్తలు



నివాళులర్పిస్తున్న శాసనమండలి సభ్యురాలు సురభి వాణిదేవి

**చిక్కడపల్లి నవంబర్ 24,ప్రభాతవార్త :** ఆదివారం మృతి చెందిన ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ తెన్నేటి సుధా దేవి అంతిమ సంస్కారాలు సోమవారం అంబర్ పేట లోని శ్మశాన వాటికలో సోమవారం ముగిశాయి. పెద్ద ఎత్తున సాహితీవేత్తలు, కళాభిమానులు సుధా దేవి పార్థివ దేహం కి నివాళి అర్పించారు. సిబిఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ, సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ, నటి రోజా రమణి, దూరదర్శన్ విశ్రాంత వ్యాఖ్యాతలు డాక్టర్ వోలేటి పార్వతీశం, విజయ దుర్గ, తెలుగు విశ్వవిద్యా లయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానంద రావు, నటుడు ప్రదీప్, నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, డాక్టర్ రా మా కాంత రావు, హాంగ్ కాంగ్ తెలుగు సంఘం అధ్యక్షుడు జయ, గాయకులు చంద్ర తేజ్, సురేఖ, అఖిల, గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, రాష్ట్ర శాసన మండలి సభ్యు లు సురభి వాణి దేవి, ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య సూర్య ధనుంజయ, రచయిత్రి డాక్టర్ కె వి కృష్ణ కుమారి, పలువురు రచయిత్రులు కవులు ఉన్నారు , ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ సభ్యులు మండలి బుధ ప్రసాద్, నటుడు రాజేంద్ర ప్రసాద్, సుబ్బ రాయ శర్మ, జస్టిస్ రాధా రాణి, శాసన సభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి, శాంత బయో టెక్ అధినేత డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, కిమ్స్ ఫౌండర్ బొల్లినేని కృష్ణయ్య, తదితర ప్రముఖులు వంశీ రామరాజు ను ఫోన్ లో పరామర్శించారు. హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ తమ సంతాప ప్రకటనలో సాహిత్య సేవలో జీవితా న్ని అంకితం చేసిన సుధా దేవి మరణం బాధా కరం అన్నారు. సమాజం లో ఆడ పిల్లలు కి విద్య సమాజిక సమస్యలు సంస్క ృతికి విలువలు పరిరక్షణ కి ఆమె రచనలు ద్వారా బలమైన సందేశం అందించారు అని తాను ఇటీవల ఆమె తో కలసి వేదిక పంచుకున్న సందర్భం గుర్తు చేసుకుని వారి కుటుంబ సభ్యులు కు విచారం తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో వందేమాతరం గీతాలాపన



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 24 ప్రభాతవార్త :** వందే మాతర గీతం మయ దేశ స్వాతంత్ర్య పోరాటానికి శక్తిగా నిలిచిందని రాజేం ద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివి జన్ కార్పొరేటర్ తోకల శ్రీని వాస్‌రెడ్డి అన్నారు. వందేమా తరం గీతం వెలువడి 150 సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండుయాదవ్ ఆధ్వర్యంలో ప్రభు త్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.రవీందర్ గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్, బిజెపి నాయకులు బుచ్చిరెడ్డి, సంతుగౌడ్, నవారు మురళీధర్ రెడ్డి, బబ్లూ, మధుసూధన్ రెడ్డి, సిహెచ్ ప్రభుదాస్, రామారావు, ఆదిముల శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

### వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలి

#### తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేతల డిమాండ్



సెంట్రల్ డిప్యూటి చీఫ్ లేబర్ కమీషనర్‌కు వినతి పత్రం అందచేస్తున్న ఫెడరేషన్ నేతలు

**ముషీరాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త:** వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల రద్దు అప్రజాస్వామ్యమని, తక్షణమే దీనిని ఉప సంహరించుకోవాలని తెలం గాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నేతలు పి.రాంచందర్, బస వపున్నయ్యలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం సెంట్రల్ డిప్యూటి చీఫ్ లేబర్ కమీషనర్‌కు వినతి ప త్రం అందచేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నేతలు మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునేంత వరకు కార్మికులు, జర్నలిస్టులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి, సాధించుకున్న కార్మిక చ ట్టాలను రద్దు చేయటం అన్యాయమని, వెంటనే లేబర్ కోడ్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేత లు వై.ప్రభాకర్, గుడిగరఘు, బి.రాజశేఖర్, దామోదర్, జి.మాణిక్‌ప్రభు, ఈ. చంద్రశేఖర్, నవీన్, మణిమాల, హరిప్రసాద్, మేకల కృష్ణ, మధుకర్, హెచ్ యూజే అధ్యక్ష కార్యదర్శులు బి.అరుణ్‌కుమార్, బి.జగదీష్, హెచ్‌యూజే నేత లు లలిత, రమాదేవి, రత్నాకర్, తలారి శ్రీనివాసరావు, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

### జీవో 46 ను రద్దు చేయాలని తెలంగాణ బిసి విద్యార్థి సంఘం నిరసన



జీవో 46 ను రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేసిన దృశ్యం

**హైదరాబాద్ నవంబర్ 24 (ప్రభాతవార్త ) :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 46 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహిం చారు. జీవో 46 ను అమలు చేసి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తుంటే ఎందుకు కాంగ్రెస్ పార్టీ బీసీ ప్రజా ప్రతినిధులు పెదవి విప్పట్లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ లో బిసి ప్రజా ప్రతినిధుల మాట చెల్లదా?, రాహుల్ గాంధీ ఆలోచన విధానాన్ని బేఖాతరు చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇచ్చిన మాట తప్పుతారా..!! అని అన్నారు. ఇకపై రాహుల్ గాంధీ మాట ఎవరు నమ్మరని, బీసీ రిజర్వేషన్లు కల్పిస్తానని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ కేవలం ఎన్నికల సమయంలో ఓట్లు దండుకోవడానికా..!! అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మార్చుకుని తక్షణమే జీవ రద్దు చేయకుంటే కాంగ్రెస్ పార్టీకి బీసీలు దూరమవడం ఖాయమన్నారు. బీసీలకు రిజర్వేషన్ వ్యతిరేక పార్టీగా కాంగ్రెస్ పార్టీని చిత్రీకరించి ప్రజలోకి తీసుకెళ్తామన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, కుల గణన లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. వెంకట్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడంతో పాటు, కేంద్ర మంత్రులపై ఒత్తిడి తేవాలన్నారు. ఇండియా కూటమికు 200 పైగా ఎంపీలు ఉన్నారు ఎక్కడ పార్లమెంట్లో మాట్లాడరు. చిత్తశుద్ధి ఉంటే రాబోయే పార్లమెం ట్ సమావేశాలు స్తంభింప చేయాలని డిమాండ్ చేశారు.

## డ్రగ్స్ విక్రేతలను పట్టుకున్న మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు

### - 4.5 గ్రాముల హెరాయిన్ స్వాధీనం

**నార్సింగి, నవంబర్ 24 ప్రభాతవార్త :** డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దాల్మియ, లక్కన్ బర్మాలు నూతన సంవత్సరం వేడుకల కోసం డ్రగ్స్‌ను తరలిస్తున్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి మైహోం అవతార్ లేబర్ క్యాంపు వద్ద డ్రగ్స్ అమ్ముతు న్నట్లు ఎస్ఓటి పోలీసులకు విశ్వసనీయంగా సమాచారం అందింది. వెంటనే అక్కడికెళ్లిన ఎస్ఓటి పోలీసులు హెరాయిన్‌ను విక్రయిస్తున్న దాల్మియ, లక్కన్ బర్మాలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 4.5గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకొని, ఇద్దరు విక్రే తలను అరెస్టు చేసి, ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసును నార్సింగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆత్మహత్యకు పాల్పడ్డ గుర్తు తెలియని వ్యక్తి

**కొంపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త** బాచుపల్లి ప్రధాన రహదారిలోని మమత ఆసు పత్రి ఎదురుగా రోడ్డు డివైడర్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఎలక్ట్రికల్ వైరుతో ఉరి వేసుకుని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం సోమవారం తెల్లవారుజామున సుమా రు మూడు గంటలకు ఈ ఆత్మహత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మమతా ఆసు పత్రి ఎదురుగా ఉన్న డివైడర్‌కు అమర్చిన ఎలక్ట్రి కల్ పోల్‌కు ఓ గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్తు తీగతో ఉరివేసుకొని కనిపించాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు సంఘట న ప్రాంతాన్ని సందర్శించి మృతదేహాన్ని, ఇతర స్థానిక ఆనవాలను పరిశీలించారు. అయితే మృ తుడు సుమారు 25 నుండి 30 సంవత్సరాల వయసు కలిగి ఉన్నాడు. మృతుడి వంటిపై నీలం రంగు జీన్స్ ప్యాంట్, చెక్స్ కలిగిన షర్టు ధరించి ఉన్నాడు. చామన చాయ రంగుతో ఉన్నాడు. మృతుడి చేతిపై రక్తపు మరకలు ఉన్న ట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుడి ఎడమ చేతిపై ఎంఎన్‌పిఆర్ అనే టాటు కలిగి ఉన్నట్లు పోలీసులు గమనించారు. ఆత్మహత్యకు పాల్పడి న వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలిసినవారు బాచుపల్లి పోలీసులను సంప్రదించాలని ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్యయత్నం

**పేట్ బషీరాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త** యాసిడ్ తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భుక్యా శ్రీను (40), విజయ లక్ష్మిలు భార్యభర్తలు. కాగా భుక్యా శ్రీను బిజినెస్ చేస్తున్నాడు. మేడ్చల్ రావుల్కోల్‌లో వారికి ప్లాట్ ఉంది. ఈ ప్లాట్ విషయంలో రాములు, రాజా, రాజు, పురుషోత్తంలు భుక్యా శ్రీనుకు ఫోన్ చేసి వేధింపులకు గురి చేయడంతో మనోవ వేదనకు గురై సోమవారం ఉదయం 8:40గం టలకు బాత్రూం కడిగే యాసిడ్ తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసాడు. వెంటనే అతన్ని కొంపల్లి లోని ఆర్కే హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తర లించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ క్రైమ్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి
### - ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి



సైబర్ క్రైమ్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట, నవంబర్ 24, ప్రభాతవార్త:** సైబర్ క్రైమ్స్ పై అవగాహన పెంపొందించుకోవాలని చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి పేర్కొన్నారు. చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో మలక్ పేట మార్కెట్లో సైబర్ క్రైమ్స్ గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో సైబర్ క్రైమ్స్ గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు భరత్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే బలాల



చావుని డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ సలాం షాహిద్ తదితరుల

**మలక్ పేట ,నవంబర్ 24, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. చావుని డివిజన్ లోని పలు ప్రాంతాలలో రూ. 3 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్య అతిథిగా హాజరై చావుని డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మలక్ పేట నియోజకవర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని, నియోజకవర్గంలో త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపిపిఏయు కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఏపిపిఏయు కాలనీలో రూ.13.50లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నిర్ధేశిత నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

**కమ్యూనిటిహాల్ పనులు ప్రారంభం..**

సైదాబాద్ డివిజన్ ఫిష్ మార్కెట్‌లో రూ.25లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటిహాల్ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## మాదన్నపేట మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
### : ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



జడ్‌సికి మార్కెట్‌లోని సమస్యలు వివరిస్తున్న ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** మాదన్నపేట మార్కెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ సోమవారం జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మార్కెట్‌లో చెత్త కుప్పలు పేరుకుపోవడం వల్ల పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందని, వెంటనే చెత్తను తొలగించేలా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని ఆయన జడ్‌సిని కోరారు. మార్కెట్‌లో టాయిలెట్స్, బాత్‌రూంలు ఏర్పాటు చేయాలని కోట్ల శ్రీనివాస్ కోరారు.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి ఎస్టీసెల్ నేతల సత్కారం



మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎస్టీసెల్ అధ్యక్షుడు తేజావత్ గణేష్‌నాయక్ తదితరులు

**రామంతాపూర్, నవంబరు 24 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు తేజావత్ గణేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సొలమన్ బాబు, మేడ్చల్ నియోజకవర్గం ఎస్టీసెల్ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్,మాలోత్ సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆబ్కారీ వ్యవస్థ మరింత బలోపేతం చేస్తాం : ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



ఉప్పల్‌లో కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 24 ప్రభాతవార్త :** ఆబ్కారీ వ్యవస్థ మరింత బలోపేతం చేస్తామని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డా.పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్‌లో నాచారం కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ కె.నవీన్‌కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ పి.ముకుందరెడ్డి, ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్ తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మొత్తం 14 కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 9 కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎక్సైజ్ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణను సాధించుకునేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, వీటి నియంత్రించేందుకు ఎక్సైజ్ వ్యవస్థ మరింత బలోపేతం ఎంతో అవసరమన్నారు. మద్యం అక్రమ రవాణా, కల్తీ నివారించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, గంజాయి డ్రగ్స్ తదితర వాటి నివారణ కోసం శాయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖ బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేయాలని కోరారు. కొత్తగా మంజూరైన ఎక్సైజ్ స్టేషన్లకు భవనాల కోసం స్థలాలు, భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు కోసం సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళుతామని తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు యువత మత్తు పదార్థాలు డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ కె.నవీన్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సిబ్బందిని మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, పలువురు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, పలువురు పార్టీల నేతలు పాల్గొన్నారు.

## లాప్రోస్కోపిక్ చికిత్సతో వృద్ధురాలి ప్రాణం కాపాడిన మలక్ పేట కేర్ ఆస్పత్రి వైద్యులు



రోగికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న కేర్ ఆసుపత్రి వైద్యులు

**మలక్ పేట ,నవంబర్ 24, ప్రభాతవార్త:** పిత్తాశయం చిట్లిపోయి అనేక వ్యాధులు ఉన్నా ఓ వృద్ధురాలికి మలక్ పేట కేర్ ఆసుపత్రి వైద్యులు లాపరోస్కోపిక్ చికిత్సను అందించి ప్రాణాన్ని కాపాడారు. ఈ సందర్భంగా సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, రోబోటిక్ సర్జరీ విభాగం హెడ్ డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్, మలక్‌పేట కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్లాలు మాట్లాడుతూ పిత్తాశయం చిట్లి, పలు దీర్ఘకాలిక వ్యాధులతో తీవ్ర పరిస్థితిలో ఉన్న 72ఏళ్ల వృద్ధురాలికి తమ మలక్‌పేట కేర్ హాస్పిటల్స్‌లో వైద్యులు లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స జరిపి ప్రాణాపాయం నుంచి బయటపడేయడం జరిగిందని వివరించారు. నల్గొండకు చెందిన ఓ మహిళ కడుపు నొప్పితో కొద్దిరోజుల క్రితం ఇతర ఆసుపత్రిలో చికిత్స పొందారు. అక్కడ పరీక్షల్లో పిత్తాశయం చిట్లి తీవ్ర ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తేలడంతో ఆమెను అత్యవసరంగా మలక్ పేట కేర్ హాస్పిటల్స్‌కు తరలించారు.రోగికి కరోనరీ ఆర్టరీ డిసీజ్, మునుపటి స్ట్రోక్, కిడ్నీ వైఫల్యం, షుగర్, హై బీపీ వంటి పలు సమస్యలు ఉండటంతో శస్త్రచికిత్స ప్రమాదకరంగా మారింది. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, రోబోటిక్ సర్జరీ విభాగం హెడ్ డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలోని బృందం అత్యాధునిక లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స చేసి పిత్తాశయం తొలగించడంతో పాటు పెరిటోనియల్ వాష్ కూడా పూర్తిచేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి 24 గంటల్లోనే కోలుకోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. అనేక ప్రమాదకర కారకాలున్నా, వేగవంతమైన నిర్ణయాలు, బృంద సమన్వయం, ఆధునిక లాపరోస్కోపిక్ నైపుణ్యం రోగి ప్రాణాలను నిలబెట్టాయని వారు వివరించారు. ఈ కేసులో సమయస్ఫూర్తి అత్యంత కీలక పాత్ర పోషించిందని, లాపరోస్కోపిక్ టెక్నిక్స్ వృద్ధ రోగుల్లో కూడా మంచి ఫలితాలను ఇవ్వగలవని ఈ కేసు మరోసారి నిరూపించిందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన చికిత్స, డయాగ్నస్టిక్స్, శస్త్రచికిత్స సామర్థ్యం, అన్నీ ఒకే చోట లభ్యం కావడం మా మెడికల్ సిస్టమ్ బలమని, మా హాస్పిటల్‌లో క్లినికల్ టీంలు సమన్వయంతో పనిచేయడం వల్లే ఇలాంటి తీవ్రమైన కేసుల్లో సురక్షిత ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. రోగికి కేంద్రీకృత వైద్య సౌకర్యాలు అందించడం మా ముఖ్య ధ్యేయమని పేర్కొన్నారు.తీవ్రంగా కొనసాగే కడుపు నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదని, సకాలంలో పరీక్షలు చేయించుకుంటే ప్రాణాపాయ సమస్యలను ముందుగానే నివారించవచ్చని తెలిపారు.

## అల్మాస్‌గూడ విశాఖనగర్‌లో రోడ్డు ఫార్మేషన్ పనులు ప్రారంభం
### -కాంగ్రెస్ నేత చొరవతో రహదారి నిర్మాణం
### -కాలనీవాసుల హర్షం



అల్మాస్‌గూడ విశాఖనగర్‌లో రోడ్డు ఫార్మేషన్ పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 24వ డివిజన్ అల్మాస్‌గూడ విశాఖనగర్ కాలనీలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి చొరవతో ప్రజల సౌకర్యార్థం లింక్ రోడ్ ఫార్మేషన్ జరిగింది. డివిజన్‌లోని విశాఖనగర్ ఫేస్-1కు సంబంధించిన రోడ్ నెంబర్ 2లో రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేని రహదారిని కంకర, మట్టితో నింపి రోలర్‌తో చదును చేసి రోడ్ ఫార్మేషన్ చేశారు. అల్మాస్‌గూడ పరిధిలో కాలనీలు ఏర్పాటై జనావాసాలు పెరుగుతున్నా చాలా చోట్ల రోడ్లు మాత్రం నిర్మాణానికి నోచుకోవడం లేదు. అందులో భాగంగానే విశాఖనగర్ కాలనీ నుండి అల్మాస్‌గూడ-గుర్రంగూడ ప్రధాన రహదారికి కలిపే లింక్ రోడ్డు సక్రమంగా లేక రాకపోకలకు వీలు లేకుండా ఉండి ఇబ్బందులు కలుగుతుండడంతో స్థానిక కాలనీవాసులు రోడ్డు ఫార్మేషన్ చేయించాలని కాంటెస్టెడ్ కార్పొరేటర్ అయిన అల్మాస్‌గూడ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డిని కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఆయన రహదారి వాస్తవ స్థితిని పరిశీలించి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌ను కలిసి కాలనీవాసుల తరపున సమస్యను వివరించారు. ఈ మేరకు స్పందించిన ఆమె మల్లారెడ్డి వినతి మేరకు ప్రజా అవసరాల దృష్ట్యా రోడ్డు ఫార్మేషన్ కోసం కార్పొరేషన్ తరపున రూ.3 లక్షలను కేటాయించారు. దీంతో సోమవారం విశాఖనగర్ ఫేస్-1 కాలనీలోని రోడ్ నెంబర్ 2 నుండి అల్మాస్‌గూడ-గుర్రంగూడ లింక్‌రోడ్డు వరకు మట్టి, కంకరను పరిచి రోడ్డు ఫార్మేషన్ పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో హర్షం వ్యక్తం చేసిన మల్లారెడ్డి స్థానిక కాలనీవాసులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. కనీస వసతులకు నోచుకోని కాలనీల్లో ప్రజలకు రోడ్లు తదితర సౌకర్యాలను కల్పించడానికి తన వంతు సహకారం అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. అల్మాస్‌గూడలో పెరిగిన కాలనీలకు అనుగుణంగా జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్‌ల సహకారంతో దశల వారీగా అభివృద్ధి పనులు చేయించడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తమ వినతికి స్పందించి చర్యలు తీసుకున్నందుకు ఆయన కమీషనర్ సరస్వతికి, డిఇఇ, ఎఇఇలకు కాలనీ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రోడ్ ఫార్మేషన్ పరిశీలన కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, సిద్దులు గుప్త, వెంకట్‌రెడ్డి, శివకుమార్, భాను ప్రసాద్, సైదులు, రాజు, బాలరాజ్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
### సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు దాసరి బాబు డిమాండ్



బాలాపూర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు దాసరి బాబు తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 24 ప్రభాతవార్త:** కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు దాసరి బాబు డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాలాపూర్ చౌరస్తాలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దాసరి బాబు మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన 29 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేయడం వల్ల కార్మికుల హక్కులకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతే కాకుండా పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూరే విధంగా ఉంటుందని ఆయన అన్నారు. కార్మికులకు నష్టదాయకంగా ఉండే ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు సిఐటియు పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు శేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు సుంకోజు యాదగిరిచారి, నిరంజన్, కిషన్, సత్యం, లక్ష్మారెడ్డి, నాయకులు మల్లికార్జున్, బురాస్, మురళి, సోమ్లా నాయక్, మోహన్, శ్రీను నాయక్, పెద్ద రాములు, షేక్ మహమ్మద్ బాషా, పాపయ్య, శ్రీనివాస్, సాయిలు, అబ్దుల్, ఖదీర్, బాషా, నిస్సార్, మహ్మద్ అహ్మద్, సోను తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తాం
### - మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్



ఫిరాజదిగూడ కార్పొరేషన్ లో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేస్తున్న మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ,పట్టణ అధ్యక్షులు తుంగతుర్తి రవి ,అమర్ సింగ్ మాజీ కార్పొరేటర్ కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్ తదితరులు

**మేడిపల్లి , అక్టోబర్ 24 ప్రభాతవార్త ;** పీరజాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ వార్డులో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ..ప్రజా పాలనలో పేదలందరికీ సురక్షితమైన, గౌరవప్రదమైన గృహాలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. ఇలాంటి పథకాలు నిజంగా అర్హులైన వారికి చేరడం సంతోషకరం అని అభిప్రాయపడ్డారు.స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి వజ్రేష్ యాదవ్ లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించి, గృహ ప్రవేశ పూజల్లో పాల్గొని కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఫిరాజాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి,మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంధాలయ ఛైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, 18 వ వార్డ్ మాజీ కార్పొరేటర్ కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్, వీరాంజనేయ స్వామి టెంపుల్ ఛైర్మన్ కవాడపు రామ్ రెడ్డి, నేతలు బండి శ్రీనివాస్ గౌడ్ ,మాజీ కార్పొరేటర్లు ,పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## రూ.కోటి 10లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు



చిలుకానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 24 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో రూ.కోటి 10 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు చేపట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ చిలుకానగర్ కళ్యాణపురి, బ్యాంక్‌కాలనీలలో రూ.20లక్షలతో పార్కులలో మౌళిక వసతుల కల్పన, మంచినీటి పైప్‌లైన్ పనులు, కొత్త సిసి రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. చిలుకానగర్‌లో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాన్నారు.ఈ కార్యక్రమంలో డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, కాలనీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణానికి వ్యతిరేకంగా భగాయత్‌వాసుల ధర్నా




ఉప్పల్ భగాయత్‌లో మద్యం దుకాణానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వభాకర్, మేకల శిల్పారెడ్డి, శివారెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 24 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఔట్ మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని కోరుతూ సోమవారం పలువురు పార్టీ నేతలు, స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, రైతు సంఘం నేతలు మేకల శివారెడ్డి, సల్ల రాజిరెడ్డి, ఐఫోకస్ గురువు వాసుదేవశర్మ, కన్వీనర్ మేకల మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భగాయత్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు ఇబ్బందులు వస్తాయని, రైతుల భూములు తీసుకుని వారికి నష్టం చేయడం సబబు కాదన్నారు. భగాయత్‌లో ఇప్పటికే ఓయో గదులు, హోటల్స్ ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మద్యం దుకాణం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతారని తెలిపారు. మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కాగా దీనిపై బిజెపి సీనియర్ నేతలు మహంకాళి లక్ష్మణ్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, రావుల బాలకృష్ణగౌడ్ ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు భగాయత్ కాలనీ వాసులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## తిరుపతి అన్నసత్రం ధర్మకర్తగా రావిరాల సంధ్యారాణి



ప్రమాణ స్వీకారం చేస్తున్న రావిరాల సంధ్యారాణి

**ఎల్.బి.నగర్, నవంబర్ 24 ప్రభాతవార్త:** అఖిల భారత పద్మశాలి తిరుపతి అన్నసత్రం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా కొత్తపేటకు చెందిన రావిరాల సంధ్యారాణి నియామకమయ్యారు. మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్, పివిటి, ఎస్‌పిటి మార్కెట్ వ్యవస్థాపకులు చిలువేరు చంద్రయ్య, భద్రాచలం సత్రం అధ్యక్షులు గోషిక యాదగిరి, తిరుపతి అన్న సత్రం మాజీ అధ్యక్షుడు జెల్లా లక్ష్మీనారాయణ, బడుగు దానయ్య, బాబురావు, మునగపాటి వెంకటరత్నం, వద్ది శివసత్యనారాయణల ఆధ్వర్యంలో రావిరాల సంధ్యారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతి అన్న సత్రం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా నియామకమైన సందర్భంగా ఆమె పెద్దల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన గౌరవ పెద్దల సలహాలు సూచనలతో భవిష్యత్తులో బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామన్నారు. అఖిలభారత పద్మశాలి తిరుపతి అన్నసత్రం ధర్మకర్తల మండలిలో అవకాశం కల్పించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారి నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలు నిర్వహిస్తామన్నారు.

## ఎల్‌బి నగర్‌లో త్వరలో నూతన కంటి, గుండె ఆసుపత్రి



సీనియర్ సిటిజన్‌లను సన్మానిస్తున్న విజయరంగ

**ఎల్.బి.నగర్, నవంబర్ 24 ప్రభాతవార్త:** కొత్తపేట న్యూమారుతీనగర్ సీనియర్ సిటిజన్స్ భవన్ నూతన భవన(ఫస్ట్‌ఫ్లోర్) పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజెన్లను లయన్స్‌క్లబ్ హెల్త్‌క్యాంప్ ఛైర్మన్, సంఘ సేవకుడు డాక్టర్ బి.విజయరంగ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయరంగ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ వైద్య సేవలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. స్థానిక ఎల్బీనగర్ ప్రజల అవసరాన్ని గుర్తించి త్వరలోనే ఒక నూతన కంటి, గుండె ఆసుపత్రి, ఒక హాస్పిస్ ప్యాలియేటివ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తి అవుతే వేలాదిమందికి వైద్య చికిత్స అందించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.నర్సింహారెడ్డి, కార్యదర్శి కనకయ్య, ఉపాధ్యక్షుడు ఎన్.కృష్ణమూర్తి, కోశాధికారి రామ్ చందర్, పలువురు సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి




మల్కాజ్‌గిరి జీహెచ్ఎంసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నేరెడ్ మెట్, నవంబర్ 24,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి జీహెచ్ఎంసీ ప్రజావాణి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నేరెడుమెట్ జెజె నగర్ పరిధిలోని ప్లాట్ నంబర్ సి 10 అలాగే యాప్రాల్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలు స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని వారు ఈ సందర్భంగా వివరించారు.ఈ అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినప్పటికీ, గత సంవత్సరం నుండి మల్కాజ్‌గిరి టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణి సమావేశంలో ఈ అంశంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జాకీయ సుల్తాన్‌కు అధికారికంగా ఫిర్యాదు అందజేశారు.అక్రమ నిర్మాణాలను తక్షణం తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి. చంద్రశేఖర్, 136వ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాది, డివిజన్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ జాన్సన్, సీనియర్ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐపై చర్య తీసుకోవాలని డిసిపికి ఫిర్యాదు

**సైదాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** ఎలాంటి ఫిర్యాదు లేకున్నా సివిల్ వివాదంలో తలదూర్చి తన భర్తను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి నిర్భంధించిన సైదాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్ఐపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక మహిళ డిసిపికి ఫిర్యాదు చేసింది. ఇంజాపూర్‌కు చెందిన ఆంబోతు జయశ్రీ తన భర్త సురేష్‌తో కలిసి నందిహిల్స్ నుండి ఇంటికి వెళ్తుండగా ఇంజాపూర్ కమాన్ దాటిన తర్వాత వీరి కారుకు అడ్డుగా ద్వి చక్ర వాహనం, రెండు కార్లలో వచ్చిన దాదాపు పది మంది వ్యక్తులు తన భర్తపై దాడి చేసి బలవంతంగా కారులో తీసుకుని వెళ్లారని జయశ్రీ తన ఫిర్యాదులో పేర్కొంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు లేకున్నా, సైదాబాద్ పిఎస్ పరిధి కాకున్నా, సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని తమను ఇబ్బందులకు గురి చేసిన ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జయశ్రీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## సింగరేణి వాంబే క్వార్టర్స్‌లోని సమస్యలు పరిష్కరించాలి : షేక్ మహమూద్

**సైదాబాద్, నవంబరు 24 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి వాంబే క్వార్టర్స్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఐఎస్ సదన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్ మహమూద్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2007లో నిర్మించిన వాంబే క్వార్టర్స్‌లో ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మత్తులు చేపట్టక పోవడం వల్ల అవి పూర్తిగా శిథిలావస్థకు చేరి, పెచ్చులూడుతున్నాయని, ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదముందని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.పారిశుధ్యం,వీధి దీపాలు,త్రాగునీరు ,రోడ్లు వంటి మౌళిక సదుపాయాల సమస్య తీవ్రంగా ఉందని,పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీమన్నారాయణీయం 50వ దశకముల పారాయణం



పారాయణం చేస్తున్న కొండూరి పద్మావతి తదితరులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 24 ప్రభాతవార్త:** గడ్డిఅన్నవరక్షేత్రం శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామి దేవస్థానములో శ్రీమన్నారాయణీయం 50వ దశకముల పారాయణం, విష్ణు సహస్రనామ, లలిత సహస్రనామ, సౌదర్యాలహరి పారాయణములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువు కొండూరు పద్మావతి ఆధ్యాత్మిక వేత్త ఆధ్వర్యంలో వారి బృందము సుమారు 300 మంది సభ్యులతో కలసి పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు రెండు మూడు గంటలకు పైగా కొనసాగిన పారాయణ కార్యక్రమం ఆధ్యాంతం కన్నుల పండుగగా, భక్తి పారవశ్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ దేవరం లింగారెడ్డి, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి భాషపాక సంతోష్‌కుమార్, కుమార స్వామి పాల్గొన్నారు.

## నూతన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌కు సన్మానం



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్‌ను సన్మానిస్తున్న బండారి రవీందర్ , మేడిపల్లి విహారిక కాలనీవాసులు, తదితరులు

**మేడిపల్లి, నవంబర్ 24 ప్రభాతవార్త ;** మేడ్చల్ మల్కాజ్ గిరి డిసిసి కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్‌ను మేడిపల్లి మాజీ ఉపసర్పంచ్ బండారి రవీందర్ సన్మానించడం జరిగింది .ఈ సందర్భంగా బండారి రవీందర్ మాట్లాడుతూ ... తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం అవుతుందని పార్టీ కార్యక్రమాలు ప్రజలకు మరింత చెరువవుతాయని విశ్వసిస్తున్నాం . ముఖ్యంగా మేడ్చల్ జిల్లాలో బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేస్తారని వీరికి ఎల్లప్పుడూ మా మద్దతు ఉంటుందని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో మేడిపల్లి మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి రవీందర్ , విహారిక కాలనీ అధ్యక్షులు సంకపాక సుధాకర్, ఏవి రమణారెడ్డి, దంతూరి వెంకటేష్ గౌడ్ , యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తి సుమిత్ పాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు .